వరదముంపురాకుండా చర్యలు: ఎమ్మెల్యే

మౌలాలి డివిజన్ దీన్‌దయాళ్‌నగర్ కాలనీలో నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, జూలై 15: వరదముంపురాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మౌలాలి డివిజన్ దీన్‌దయాళ్‌నగర్ కాలనీలో నుంచి పారుతున్న నాలాను అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ నాలాలో పూడిక తీయకపోవడంతో వరదనీరు పారకుండా కాలనీ రోడ్లతో పాటు ఇండ్లలోకి వస్తున్నాయన్నారు. ప్రస్తుతం నాలాలోని పూడికను యుద్ధ ప్రాతిపదికన తీయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ మహేష్, ఏఈ మధురిమ, జేఏసీ వెంకన్న, మేకల రాముయాదవ్, మురుగేష్, భాగ్యనందరావు, ఉస్మాన్, ఇబ్రహీం, సంతోష్, గుప్త తదితరులు పాల్గొన్నారు.

పూడికతీతను సక్రమంగా చేపట్టాలి

నేరేడ్‌మెట్, జూలై 15: నాలాల్లో పూడికతీతను సక్రమంగా చేపట్టాలని వినాయకనగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి సూచించారు. సోమవారం డివిజన్‌లో నాలాలు, పారిశుధ్య పనులను మున్సిపల్ ఏఈ సత్యలక్ష్మి అధికారితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా దీన్‌దయాల్‌నగర్‌లోని పలు నాలాల వద్దకు వెళ్లి అక్కడ నాలాలో పూడికతీత పనులు జరగలేదని గమనించి వెంటనే పనులు పూర్తి చేయాలని సిబ్బందికి చెప్పారు. వరదనీరు, డ్రైనేజీ మురుగు రెండు కలిసి ఉండడం వల్ల డ్రైనేజీ బ్లాక్ అవుతున్నదని గమనించిన వెంటనే సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సాగర్, వెంకటేష్, కాలనీవాసులు నర్సింగ్‌రావు, శ్రవన్, ఓంప్రకాష్, సాయి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నాలాలోని పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి



ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో బోనాల చెక్కులను కార్పొరేటర్లతో కలిసి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, ఇన్‌చార్జి ఈఓ భాగ్యలక్ష్మి,

బోనాల చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

వైభవంగా బోనాలు నిర్వహించాలి

నేరేడ్‌మెట్, జూలై 15: భవిష్యత్తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పేలా పండుగలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. సోమవారం గౌతంనగర్ డివిజన్ వాణినగర్‌లోని విజయ వినాయక ఆలయంలో బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం మల్కాజిగిరి నియోజకవర్గానికి 153 అప్లికేషన్స్‌కు గాను రూ. 61,75,400 ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లతో ఆయన ఆలయాల కమిటీ సభ్యులకు వారు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం బోనాల పండుగను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఆలయాలకు నిధులు మంజూరు చేసిందన్నారు. మల్కాజిగిరి ప్రజలంతా భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను జరుపుకోవాలని సూచించారు. అనంతరం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ బోనాల పండుగను మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర పండుగగా ప్రకటించి ఉత్సవాలు ప్రభుత్వం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేయాలని సూచించారు.అమ్మవారి దయతో వర్షాలు సమృద్ధిగా కురిసి తెలంగాణ సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర ప్రజలందరికి అమ్మవారి ఆశీస్సులు పుష్కలంగా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఏకే.మురుగేష్, శాంతి శ్రీనివాస్ రెడ్డి, ప్రేంకుమార్,సబిత అనిల్‌కిషోర్, మీనా ఉపేందర్ రెడ్డి, రాజ్యలక్ష్మి, సునీతాయాదవ్, బీఆర్ఎస్ నాయకులు పరశురాంరెడ్డి, వెంకన్న, రాముయాదవ్, జీకే హన్మంతరావు, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వంశీముదిరాజ్, ఉస్మాన్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

- పలు చోట్ల బోనాల నిర్వహణ చెక్కుల పంపిణీ
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, బీర్ల ఐలయ్య, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ మల్లేశం, కార్పొరేటర్లు
- భక్తులకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలు

రామంతాపూర్/ఉప్పల్/కాప్రా/మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గంలో బోనాల ఉత్సవాలను దిగ్విజయంగా జరుపుకోవాలని ఎమ్మెల్సీ యెగ్గె మల్లేష్ యాదవ్ అన్నారు. సోమవారం ఏఎస్‌రావునగర్ డివిజన్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన బోనాల ఉత్సవాల చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనమండలి సభ్యులు యెగ్గె మల్లేష్ యాదవ్ హాజరయ్యారు. దేవాదాయ శాఖ ఇన్‌చార్జి ఈఓ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి యాదవ్, జెర్రిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, జెర్రిపోతుల ప్రభుదాస్,శాంతి సాయిజెన్ శేఖర్, చైతన్య హరీష్, శ్రీవాణి, బన్నాల గీతాప్రవీణ్‌లతో కలిసి బోనాల ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన కమిటీల ప్రతినిధులకు ప్రభుత్వం పంపిణీ చేసిన చెక్కులను ఎమ్మెల్సీ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆషాఢ బోనాలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. నియోజకవర్గం పరిధిలో బోనాల ఉత్సవాల కోసం మొత్తం 148 దరఖాస్తులు వచ్చినట్లు దేవాదాయ శాఖ ఇన్‌చార్జి ఈఓ భాగ్యలక్ష్మి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.47,79,500 నిధులను మంజూరు చేసిందని ఈఓ తెలిపారు. 104 మంది ఆలయ నిర్వాహక కమిటీలకు సోమవారం చెక్కులను పంపిణీ చేసినట్టు ఈఓ వివరించారు. చెక్కులు పొందలేకపోయిన మిగిలిన ఆలయ నిర్వాహకులు తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కాప్రా తహసీల్దార్ సుచరిత, ఆలయకమిటీలనిర్వాహకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరిస్తాం..

అల్వాల్ సర్కిల్ డీసీ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

మల్కాజిగిరి, జూలై 15: ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరిస్తామని అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం అల్వాల్, మల్కాజిగిరి సర్కిల్‌లలో ప్రజావాణిలో సమస్యలపై స్థానికులు డీసీలకు పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ సెక్షన్‌లపై ఫిర్యాదు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డీసీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాకాలంలో వ్యాధులు రాకుండా చర్యలు తీసుకుంటామని, వరద ముంపు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ రాజు, వెంకటేష్, కృష్ణారెడ్డి, శేఖర్, అజయ్‌రెడ్డి, శ్రీనివాస్, రాజిరెడ్డి, వినయ్, శంకర్, ఉదయ్‌ప్రకాష్, గోపి, ప్రదీప్, కరుణశ్రీ, సుజాత, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కాప్రా సర్కిల్‌లో..

కాప్రా: కాప్రా, మల్లాపూర్, నాచారం డివిజన్ల పరిధిలో నుంచి మూడు ఫిర్యాదులు అందాయి. కాప్రా డివిజన్‌లో ఓ ఆస్తికి సంబంధించి యజమాని పేరు మార్పిడిపై రబియాబీ అనే మహిళ ఫిర్యాదు చేశారు. మల్లాపూర్, నాచారం డివిజన్ల పరిధిలో అక్రమనిర్మాణాలు జరుగుతున్నాయని, వీటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయా డివిజన్ల నుంచి జి.ప్రభాకర్‌రెడ్డి, గౌడ సుదర్శన్ ఫిర్యాదు చేశారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత విభాగాల ఇన్‌చార్జిలు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని డీసీ ముకుందరెడ్డి అధికారులను ఆదేశించారు.

బోడుప్పల్ మేయర్‌గా అజయ్ యాదవ్ నియామకం

అజయ్ యాదవ్ (మేయర్,బోడుప్పల్)

బోడుప్పల్, జూలై15: బోడుప్పల్ బల్దియాకు తోటకూర అజయ్ యాదవ్ నూతన మేయర్‌గా ఎన్నికయ్యారు. గత నెల29న మేయర్ సామల బుచ్చిరెడ్డిపై స్థానిక కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు నూతన మేయర్, డిప్యూటీ మేయర్ల ఎంపికకు నామినేషన్లు స్వీకరించారు. మేయర్ పదవికి తోటకూర అజయ్‌యాదవ్, డిప్యూటీ మేయర్ పదవికి కొత్త ప్రవంతికిశోర్‌గౌడ్ నామినేషన్లు మాత్రమే రావడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్డీవో ప్రకటించారు. అనంతరం వారికి నియామక పత్రాలను అందజేశారు. మేయర్‌గా అజయ్‌యాదవ్ బాధ్యతలు స్వీకరించిన తరువాత కాంగ్రెస్ శ్రేణులు అంబేద్కర్ చౌరస్తానుంచి భారీ ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో బోడుప్పల్‌లోని 28 మంది కార్పొరేటర్లకు గాను 26మంది కార్పొరేటర్లు హాజరయ్యారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

మల్లాపూర్, జూలై 15: ఈ నెల 19వ తేదీన భువనగిరి జిల్లా యాదాద్రి(యాదగిరిగుట్ట)లో రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న ఆధ్వర్యంలో జరిగే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం జ్యోతి మాదిగ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతు పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని, మాదిగల ఓట్లపై ఉన్న శ్రద్ధ ప్రధాని మోడీకి ఎస్సీ వర్గీకరణపై లేదని అందుకోసం మాదిగల చిరకాల కోరికైన ఎస్సీ వర్గీకరణ చేయకుండా మోసం చేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

నేరేడ్‌మెట్, జూలై 15: అనుమతి లేని పెంట్‌హౌస్ నిర్మాణాన్ని మున్సిపల్ సిబ్బంది సోమవారం కూలగొట్టారు. వినాయకనగర్ డివిజన్ దినకర్‌నగర్ గ్యాస్ కంపెనీ సమీపంలో ఇందిర గత కొన్ని సంవత్సరాలుగా కాంప్లెక్స్‌పై పెంట్‌హౌస్ నిర్మాణం చేసుకుని నివాసం ఉంటుంది. అదే కాంప్లెక్స్‌లో ఉమ అనే మహిళ నివాసం ఉంటుంది. ఇందిర , ఉమ మధ్య చిన్న తగాదాలు ఉండడంతోమల్కాజిగిరి మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ సిబ్బంది సోమవారం పెంటౌస్‌లో నివాసం ఉంటున్న ఇందిరకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూలగొట్టారు.

వీధి కుక్కల నివారణకు చర్యలు

మేడ్చల్‌కలెక్టరేట్, జూలై 15: వీధి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి అన్నారు.నాగారం మున్సిపల్ పరిధి 17వ వార్డు న్యూహనుమాన్‌నగర్ కాలనీలో ఉన్న వీధి కుక్కలను సోమవారం బ్లూ క్రాస్ ద్వారా పట్టించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

మేడిపల్లి పోలీసుల అదుపులో బోడుప్పల్ బీఆర్ఎస్ నాయకులు

ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ నేతల నినాదాలు

బోడుప్పల్, జూలై15: కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తే నిర్బంధాలకు పాల్పడుతున్నారని బోడుప్పల్ బీఆర్ఎస్ నాయకులు ఉప్పరి విజయ్ అన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించమంటే అక్రమ అరెస్ట్‌లు చేస్తున్నారని ఆరోపించారు. సోమవారం సీఎం క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడి పిలుపులో భాగంగా బోడుప్పల్‌కు చెందిన పలువురి బీఆర్ఎస్ నాయకులను మేడిపల్లి పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ అయినవారిలో తాల్క శత్రఘ్న, రాకేష్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు

ఉప్పల్: మెగా డీఎస్సీ, గ్రూప్స్ పోస్టులు పెంచాలని, పరీక్షలు వాయిదావేయాలని సచివాలయ ముట్టడి సందర్భంగా ఉప్పల్, రామంతాపూర్, చిలుకానగర్ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్‌పార్టీ నాయకులను సోమవారం ఉప్పల్ పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ మేరకు చిలుకానగర్ ప్రాంతానికి చెందిన సీనియర్ నాయకుడు నరేష్ ముదిరాజ్, నర్సింగ్‌రావు, పవన్‌కుమార్, పరమేశ్, తిరుమలేష్, సంతోష్, సురేష్, రాజు, వినోద్, శంకర్‌లను అరెస్టు చేసి, ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

ఘట్‌కేసర్ పరిధి బ్రూక్‌బాండ్ కాలనీలో ప్రజలకు మొక్కలు పంపిణీ చేస్తున్న కమిషనర్ ఎండీ సాబేర్ అలీ

ఘట్‌కేసర్,జూలై15: ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవంలో భాగంగా ఘట్‌కేసర్ కమిషనర్ ఎండీ సాబేర్ అలీ ప్రజలకు సోమవారం మొక్కలను పంపిణీ చేశారు. ఇక్కడి బ్రూక్‌బాండ్ కాలనీ గ్రౌండ్‌లో కాలనీ ప్రజలకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పండ్లు, పూలు,నీడనిచ్చే మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని కోరారు. ప్రతి ఇంటికి ఐదు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు.

జవహర్‌నగర్‌లో..

జవహర్‌నగర్: వన మహోత్సవంలో భాగంగా మేయర్‌శాంతికోటేష్‌గౌడ్ సోమవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ప్రభు త్వ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ శాంతి హాజర య్యారు. కార్యక్రమంలో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, ఆర్ఓ ప్రభాకర్‌యాదవ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కార్పొరేటర్లు నవీన్‌కుమార్,శ్రీనివాస్‌రెడ్డి,రాంచందర్, రవి, ప్రిన్సిపాల్ అజామోహినుద్దీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణప్ప, డాక్టర్ శుష్మ, ఆరోగ్య విస్తరణ అధికారిషౌకత్ అలీ, మహిళలు, పాల్గొన్నారు.

పోస్టాఫీస్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న పోస్టాఫీసు అధికారులు

మేడ్చల్,జూలై 15: మల్కాజిగిరి పోస్టాఫీసుకు సొంత భవనం నిర్మించేందుకు ప్రభుత్వ స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీ ఈటల రాజేందర్‌కు పోస్టల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవాం వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం సర్కిల్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, బీపీ ఎంలు రాజగోపాల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం

స్వామివారికి రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు

కీసర, జూలై 15: కీసరగుట్టలో స్వామివారికి వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. స్వామివారికి వేదపండితులు తేనె, ఆవుపాలు, పంచామృతంతో ప్రత్యేక మహాన్యాస పూర్వక రుద్రాభిషేకంను నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం తరుపున పూర్తి ఏర్పాట్లు చేశామన్నారు.

ఇద్దరు అదృశ్యం

బుడిగె ఈశ్వర్, కేతావత్ గణేశ్ (ఫైల్)

శామీర్‌పేట,జూలై15: వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనంప్రకారం..మూడుచింతలపల్లి మండలం కేశ్వాపూర్ గ్రామానికి చెందిన బుడిగె ఈశ్వర్(31) ఈనెల 10న డ్యూటీకి కీసర వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. ఇంతవరకు ఇంటికి రాకపోవడంతో ఆయనకోసం వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. మరో సంఘటనలో మూడుచింతపల్లి మండలం కేశవరం తండాకు చెందిన కేతావత్ గణేష్(24) ఈనెల 8న సెలూన్‌కి వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి ఇప్పటి వరకు ఇంటికి తిరిగి రాలేదు. ఆయన కోసం వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శామీర్‌పేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వ్యక్తుల ఆచూకీ తెలిసిన వారు 8919225403, 9951560564, 709 3413982, 9666363069 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఉప్పల్, జూలై 15: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఉప్పల్ భగాయత్ ఏఈ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని సత్యనగర్, ట్రైకలర్ అపార్ట్‌మెంట్స్, ఆదిత్య హాస్పిటల్ లేన్, నల్లపోచమ్మ టెంపుల్‌లేన్ ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు

ఘట్‌కేసర్,జూలై15: పోచారం మున్సిపాలిటీ లక్ష్మీనర్సింహకాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు వైస్‌చైర్మన్ రెడ్యానాయక్ తెలిపారు. సోమవారం డ్రైనేజీ నిర్మాణానికి సంబంధించిన స్థలం విషయంలో పట్టా స్థలం నుంచి మెయిన్ రోడ్డు డ్రైనేజీలో కలవాల్సి ఉండడంతో పట్టాదారులైన సింగిరెడ్డి నర్సింహారెడ్డితో మాట్లాడి సోమవారం ఒప్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాజశేఖర్,నాయకులు శేఖర్ ముదిరాజ్,ఏఈ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులను తొలగించాలని మహిళల ఆందోళన

శామీర్‌పేట, జూలై 15: బెల్టు షాపులతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని మహిళలు ఆరోపించారు. మండల పరిధి పొన్నాల్ గ్రామంలో బెల్టుషాపులు తొలగించాలంటూ సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ బెల్టుషాపులతో గ్రామంలో చిన్నా పెద్ద తేడా లేకుండా మద్యానికి బానిసలవుతున్నారని ఆరోపించారు. గ్రామంలో బెల్టు షాపులను తొలగించాలనివారు కోరారు.

కొత్త చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలి : ఏసీపీ

చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ రాములు

శామీర్‌పేట, జూలై 15 : కొత్త చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కొత్త నేర చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత ఉపయోగపడే విధంగా అమల్లోకి తీసుకువచ్చిన చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకొని, అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పేట్‌బషీరాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్సైలు హారిక, అనిత, పరుశురాం, మునీందర్, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కాలనీలో కార్పొరేటర్ పర్యటన

ఉప్పల్, జూలై 15: నాచారం డివిజన్‌లోని పలు కాలనీల్లో కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ సోమవారం పర్యటించారు. ఈమేరకు వరదనీటి ప్రాంతాలను పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో నాచారంలోని పోలీస్‌స్టేషన్ వెనుక ప్రహరీ సోమవారం కూలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవానీనగర్ కాలనీ రోడ్డులో గోడ కూలిపోవడంతో ప్రమాదం తప్పింది. గతకొంతకాలంగా పూలు విక్రయించే వ్యాపారం చేస్తున్న సుజాత అనే మహిళకు చెందిన తోపుడు బండి ధ్వంసమైంది. దీనితో మహిళ ఉపాధి కోల్పోయింది. మహిళను కార్పొరేటర్ పరామర్శించి, తనవంతు తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ నాయకులు సాయిజెన్ శేఖర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కూలిన ప్రహరీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్

పిల్లలను అంగన్‌వాడీలకు పంపాలి

శామీర్‌పేట, జూలై 15 : బడీడు పిల్లలందరు బడిలోనే ఉండాలని ప్రతి ఒక్కరు తమ తమ పిల్లలను బాధ్యతగా (3 సంవత్సరాల్లోపు) అంగన్‌వాడీ కేంద్రాలో చేర్పించాలని ఎంపీడీవో మమతాభాయి కోరారు. శామీర్‌పేట గ్రామంలో సోమవారం అమ్మమాట-అంగన్‌వాడీబాట కార్యక్రమ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మా, అంగన్‌వాడీ టీచర్లు నిర్మళ, రమాదేవి,శకుంతల,పుష్ప, భవానీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో...

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో సోమవారం అమ్మమాట-అంగన్‌వాడీ బాట పేరుతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లల తల్లిదండ్రులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు మాట్లాడుతూ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలను చేర్పించాలని కోరారు. తద్వారా పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి అమలవుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మేడ్చల్‌లో అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు, టీచర్లు, తల్లిదండ్రులు, చిన్నారులు

డబుల్ ఇండ్లను స్థానికులకు కేటాయించాలి

కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, నాయకులు, స్థానికులు

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 15: నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను స్థానికులకు కేటాయించాలని మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, బీజేపీ నాయకులు జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రాంపల్లి సర్వే నంబర్ 258 లో 52 ఎకరాలలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించారని అందులో స్థానికుల వృత్తుల వారికి 10 శాతం కేటాయిస్తామని అప్పటి పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారని కలెక్టర్‌కు వివరించారు.10 శాతం ఇండ్లను స్థానికులకు ఇవ్వాలని కోరారు. రాంపల్లి–చర్లపల్లి రోడ్డును మరమ్మతులు చేయాలని బీఆర్ఎస్ నాయకులు గండి అంజయ్యగౌడ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

శామీర్‌పేట, జూలై 15: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తూంకుంట మున్సిపాలిటీ కమిషనర్ వెంకటగోపాల్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.